

పెద్దమ్మతల్లికి ఆదాయం...
దుకాణాల నిర్వహణకు నిర్వహించిన వేలంలో శ్రీ పెద్దమ్మతల్లి ఆలయానికి గతంకంటే ఆదాయం పెరిగింది. 8లో



కొలువుల పేరుతో దగా
జెన్‌కోలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కార్మిక సంఘాల నాయకులు నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 27°

వాతావరణం
జిల్లాలో గురువారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వామివారికి స్నపన తిరుమంజనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. బుధవారాన్ని పురస్కరించుకుని స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు.

నిత్యాన్నదానం, గోశాలకు విరాళాలు



దాతలకు రశీదును అందజేస్తున్న ఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానం, గోశాల నిర్మాణానికి కొత్తగూడేనికి చెందిన సమయమంతుల రాజ్యలక్ష్మి, కామేశ్వర రావు దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. వీరితో పాటు కొత్తగూడేనికి చెందిన చెక్క సాయిలక్ష్మణ్‌రావు, నాగకమల, సుదర్శనదాస్, సుబ్రద్రమ్మ దంపతులు నిత్యాన్నదానానికి రూ.50 వేలు, గోశాల నిర్మాణానికి మరో రూ.50 వేలు ఈఓ రమాదేవికి అందజేశారు.

ప్రశాంతంగా పాలిసెట్

- జిల్లాలో 92.26 శాతం హాజరు



విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలిసెట్‌–23 ప్రశాంతంగా ముగిసింది. 16 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 3,948 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 3,682 మంది హాజరయ్యారు. 266 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ వినీత్ ఆదేశాలతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల కన్వీనర్ నాగముని నాయక్ తెలిపారు.

నేడు ఎడ్‌సెట్

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎడ్‌సెట్ నిర్వహించనున్నారు. మూడు విడతల్లో పరీక్ష నిర్వహించనుండగా, ఒక్కో విడతకు 125 మంది చొప్పున 375 మంది హాజరుకానున్నారు. మొదటి విడత పరీక్షకు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, రెండో విడత ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు, మూడో విడత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

4న ఈత పోటీలు

సింగరేణి(కొత్తగూడెం): వచ్చే నెల 4న సికింద్రాబాద్‌లో సీనియర్ గ్రూప్ రాష్ట్రస్థాయి ఈత పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ హనుమంత రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 18,19 తేదీల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 5 నెలల ఫౌండేషన్ కోర్సులో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లను టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 98484 94290, 90320 77276 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆదివాసీలతో మమేకం



ఆదివాసీ మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

- భద్రాచలంలో ఆదివాసీలతో రాష్ట్ర గవర్నర్ తమిళిసై ముఖాముఖి
- ఏడాదిలోపు వీలైనన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ
- ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని స్థానికుల వేడుకోలు



ఆదివాసీలతో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

భద్రాచలం: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ భద్రాచలం పర్యటనలో ఆద్యంతం ఆదివాసీలతో మమేకమయ్యారు. ఆదివాసీ యువతులు సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలుకగా.. ఆమె కూడా వారితో కలిసి కొద్దిసేపు నృత్యం చేసి ఉత్సాహపరిచారు. గతంలో పర్యటించినపుడు కలిసిన గోగులపుడి, పూసుగుంట్ల గ్రామాల కొండరెడ్లను ప్రత్యేకంగా మళ్లీ కలిశారు. గిరిజన మహిళలకు మెడికల్ కిట్లను అందించటంతోపాటు సమస్యలను విన్నవించిన ప్రతీ ఒక్కరి పేరును ప్రస్తావించారు. కార్యక్రమానికి హాజరైన అందరి సత్కారాలు అందుకున్నారు. తనను కలిసేందుకు గిరిజనులు, ఇతరులు పోటీపడినా ఓపికగా చిరునవ్వుతో పలుకరించారు. అందరితో ఫొటోలు దిగారు. కార్యక్రమం పూర్తయ్యాక ప్రతీ ఒక్కరిని భోజనం చేసి వెళ్లాలని సూచించారు. స్వయంగా గవర్నరే భోజనం వడ్డించటంతోపాటు వారితో కలిసి భోజనం చేశారు. పూర్తి స్థాయిలో తెలుగులోనే మాట్లాడేందుకు ప్రయత్నించి సఫలమయ్యారు.

అక్కగా ఉంటాను...

ఆదివాసీలకు అక్కగా, అండగా ఉంటానని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ అన్నారు. బుధవారం భద్రాచలం పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. రామాలయంలో శ్రీసీతారామ చంద్రస్వామివారి దర్శనం అనంతరం కూనవరం రోడ్డులో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆదివాసీలు, ఐదు గ్రామపంచాయతీలకు చెందిన ప్రజలతో ముఖాముఖి, రెడ్ క్రాస్ ప్రతినిధుల సమావేశంలో గవర్నర్ పాల్గొన్నారు. వారి సమస్యలను ఆసక్తిగా విని నోట్ చేసుకున్నారు. అధికంగా మెడికల్ క్యాంపులను నిర్వహించాలని రెడ్‌క్రాస్ ప్రతినిధులకు సూచించారు.

తెలంగాణలో కలిపేందుకు సాయం చేయండి

2014 నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఏపీలో కలిపిన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాలని ఆ ప్రాంత ప్రజలు సంపత్, డేగల ఈశ్వరి, నక్కా వెంకన్న, పూసం రాఘవయ్య తదితరులు గవర్నర్‌ను కలిసి విన్నవించారు. తమ అభిప్రాయం పరిగణనలోకి తీసుకోకుండా అన్యాయంగా ఏపీలో కలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 350 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఆదివాసీలు నిరుద్యోగ, ఉపాధి కల్పనలో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. భద్రాచలంతో అనుబంధం ఉన్న చరిత్రాత్మక స్థలాలు గుండాల, పురుషోత్తపట్నం వంటి ప్రాంతాలను విడదీశారని వివరించారు. దేవతలా, అమ్మలా భద్రాచలం వచ్చి మా సమస్యలను వింటున్నారని, భద్రాచలంలో మమ్మల్ని కలిపితేనే భద్రాచలానికి, తమకు భవిష్యత్ ఉంటుందని, తమకు సాయం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇక్కడ ప్రాంత ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహించాలంటూ గవర్నర్‌ను వేడుకున్నారు.

ఇలవేల్పుల జాతర్లకు నిధులు ఇవ్వాలి

ఆదివాసీ పూజారి అసోసియేషన్ తరఫున రవితేజ మాట్లాడుతూ ఆదివాసీ జాతుల్లో నూట యాభై మంది ఇలవేల్పులు ఉన్నారని, కానీ ఒక్క సమ్మక్క సారలమ్మకే రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తోందని అన్నారు. ఇతర ఇలవేల్పుల జాతర్లకు కూడా ప్రభుత్వం సాయం అందించాలని కోరారు. ఆదివాసీ మహిళ సుధారాణి మాట్లాడుతూ ఆదివాసీ పూజారులకు కనీస వేతనాలను అందించాలని విన్నవించారు. ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. కొండరెడ్లకు విద్యా, ఉపాధి రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలని కొండరెడ్ల సంఘ నాయకుడు ముర్ల రమేష్ విన్నవించారు.

భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది కొరత : ఎమ్మెల్యే పొదెం

నాలుగు రాష్ట్రాల గిరిజనులకు పెద్ద దిక్కుగా ఉన్న భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని గవర్నర్‌కు స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య వివరించారు. పోడు హక్కుల పత్రాల పంపిణీ , జీఓ నంబర్3 పునరుద్ధరణ వంటి అంశాలను ప్రస్తావించారు. కొన్ని తెగలను ఎస్టీ జాబితాలో కలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిని తాము వ్యతిరేకిస్తున్నట్లు గవర్నర్‌కు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఘన స్వాగతం

ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్‌కు ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. ఉదయం దర్శనానికి ప్రారంభమయ్యే సమయంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. గవర్నర్ వచ్చే సమయంలో ఎటువంటి ఆటంకాలు ఏర్పడకుండా ఏఎస్పీ ఆలయంలో స్వయంగా పరిశీలించారు. సీఆర్‌పీఎఫ్, పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు. ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో గవర్నర్ ప్రైవేట్ కార్యదర్శి భవానీ శంకర్, కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి సులోచనా రాణి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, మైనారిటీ సంక్షేమ అధికారి సంజీవ రావు, ఆర్డీఓ రత్నకల్యాణి, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట భద్రత నడుమ..

బూర్గంపాడు: పటిష్ట పోలీసు భద్రత నడుమ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ భద్రాచలం పర్యటన కొనసాగింది. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి రైలు మార్గంలో బయలుదేరిన ఆమె బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. అక్కడ భద్రాచలం ఐటీడీఏ పీఓ పోట్రు గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. మూడుగంటలపాటు ఐటీసీ గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకున్న ఆమె అల్పాహారం అనంతరం భద్రాచలం పర్యటనకు వెళ్లారు. అందుకుముందు ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భద్రాచలం పర్యటన ముగించుకుని మళ్లీ ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్ భోజనానంతరం ఇక్కడ్నుంచి బయలుదేరి వెళ్లారు. ఎస్పీ డాక్టర్ వినీత్ వీడ్కోలు పలికారు.



ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై



రామాలయంలో భక్తులతో కరచాలనం..



ఆదివాసీ మహిళలకు భోజనం వడ్డిస్తూ..



ఏజెన్సీ సమస్యలపై ఎమ్మెల్యే పొదెం వినతి..

డయాలసిస్ కేంద్రాలు సిద్ధం

కలెక్టర్ అనుదీప్



సిద్ధమైన డయాలసిస్ సెంటర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మణుగూరు, ఇల్లెందు ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు సిద్ధమైనట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాకు మూడు కేంద్రాలు మంజూరుకాగా, రెండు మణుగూరు ప్రాంతీయ ఆస్పత్రి, ఇల్లెందు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించేందుకు సిద్ధం చేశామని, త్వరలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. ప్రస్తుతం జిల్లాలోని కొత్తగూడెం ఆస్పత్రిలో 5 మెషిన్లతో, భద్రాచలం ఆస్పత్రిలో 10 మెషిన్లతో డయాలసిస్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ రెండు కేంద్రాలు సరిపోక రోగులు వేచి చూడాల్సివచ్చేదని, ఇబ్బందుల విషయాన్ని ప్రభుత్వానికి నివేదించగా మరో మూడింటికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అశ్వారావుపేటలో కూడా డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, ఈ నెల చివరి నాటికి కేంద్రం అందుబాటులోకి వస్తుందని అన్నారు. మణుగూరు, అశ్వారావుపేట, ఇల్లెందులలో ఒక్కో కేంద్రానికి రూ.50 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు వివరించారు.

జగన్నాథపురం పంచాయతీకి జాతీయ అవార్డు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ములకలపల్లి: జాతీయ నీటి అవార్డుల విభాగంలో ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో ప్రథమస్థానం సాధించడం పట్ల బుధవారం కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి నుంచి లేఖ పంపారని తెలిపారు. నీటి సంరక్షణకు చేపట్టిన చర్యల ఫలితంగా 2022 సంవత్సరానికి జాతీయస్థాయిలో ప్రథమ అవార్డు సాధించామని పేర్కొన్నారు.

సమష్టి కృషితోనే: గడ్డం భవాని, సర్పంచ్, జగన్నాథపురం

అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల సమష్టి సహకారంతోనే జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచామని సర్పంచ్ గడ్డం భవాని తెలిపారు. నీటి లభ్యత, ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాయని పేర్కొన్నారు. వాన నీటిని సద్వినియోగం చేసుకోవడం, నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ స్థాయిలో ముందజలో నిలువగలిగామని తెలిపారు.

'పామాయిల్' విస్తరణ పనులు పరిశీలన



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి

దమ్మపేట: పామాయిల్ ఫ్యాక్టరీలో జరుగుతున్న విస్తరణ, అభివృద్ధి పనులను ఆయిల్‌ఫెడ్ (ప్రాజెక్ట్స్) మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. బుధవారం మండల పరిధిలోని అప్పారావుపేట గ్రామంలోని పామాయిల్ ఫ్యాక్టరీని ఆయన సందర్శించారు. ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యాన్ని 60 టన్నుల నుంచి 90 టన్నులకు పెంచుతున్న క్రమంలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఫ్యాక్టరీకి గెలలు అధికంగా వచ్చి, రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. ఆగస్టు నాటికి పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్లు కళ్యాణ్, నాగబాబు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా మారిన పాల్వంచ- కిన్నెరసాని ప్రధాన రహదారి

వడ... దడ

చుంచుపల్లి: వారం రోజులుగా జిల్లాలో ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఎండవేడిమి, వడగాలులతో జనం అల్లాడిపోతున్నారు. బుధవారం జూలురుపాడులో 46.4 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతల్లో ఇదే అత్యధికం. మరో ఆరు రోజులు ఇలాగే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. చుంచుపల్లిలో 45.4, పాల్వంచ యానంబైలులో 44.5, అశ్వాపురం 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలతోపాటు అనేక చోట్ల 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎండ తగలకుండా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

శరీరం లవణాలు కోల్పోయి...

బయటి ఉష్ణోగ్రతలతోపాటే శరీర ఉష్ణోగ్రత కూడా బాగా పెరిగిపోతుంది. దీంతో చెమట రూపంలో శరీరం తననితాను చల్లబరుచుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలో శరీరంలో ఉన్న నీరంతా చెమట రూపంలో బయటకు వస్తుంది. దీంతోపాటు శరీరంలో ఉండే పొటాషియం, సోడియం, క్లోరైడ్, ఫాస్ఫరస్ వంటి లవణాలు కూడా బయటకు వెళ్తాయి. ఎండాకాలంలో డీహైడ్రేషన్ వల్ల ఒక్కోసారి రక్తనాళాలు ఉబ్బి రక్తపోటు పడిపోతుంది. దీంతో మెదడుకు రక్తప్రసరణ తగ్గి ఉన్నట్టుండి కళ్లు తిరిగిపడిపోతారు. అందువల్ల బయటకు వెళ్లేముందు, వెళ్లాక కూడా తప్పకుండా నీళ్లు, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణాలు, పండ్ల రసాలు తీసుకోవాలి. మండు వేసవిలో శీతల పానీయాలు తాగకూడదు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే చక్కెర, ఉప్పు కలిసిన నీరు తాగాలి.

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- జూలూరుపాడులో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ఇదే అత్యధికం
- వేసవితాపంతో విలవిల్లాడుతున్న జనం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణుల సూచన

తగినంత నీరు తాగాలి

జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ తగలకుండా తప్పించుకోవచ్చు. వేసవిలో ప్రధానంగా ఇంటి వాతావరణం చల్లగా ఉండేటట్లు చూసుకోవాలి. బయటకు వెళ్తే కచ్చితంగా వాటర్ బాటిల్ తీసుకెళ్లాలి. రోజుకు కనీసం నాలుగైదు లీటర్ల నీళ్లు తాగాలి. వదులుగా ఉండే వస్త్రాలు వాడాలి. ఇక తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేలా ఆహారం తీసుకోవాలి. శరీర ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించేందుకు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. పాలకూర తదితర ఆకు కూరలు, ముల్లంగి, వెల్లుల్లి, నీరుల్లి, బీట్‌రూట్ వంటివి క్రమం తప్పకుండా తీసుకోవాలి. డీహైడ్రేషన్ నుంచి బయటపడేందుకు నిమ్మరసం, మజ్జిగ, పండ్లరసం, కొబ్బరి నీళ్లు తాగాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే.. కచ్చితంగా ముఖానికి, తలకు గుడ్డ కట్టుకోవడం మరచిపోవద్దు. గొడుగు, చలువ కళ్లద్దాలు వినియోగించాలి. డీహైడ్రేషన్‌కు గురైన వారిలో వాంతులు, వికారం, జ్వరం, కడుపు నొప్పి, అలసట, తలనొప్పి, కళ్లు తిరగడం, నీళ్ల విరోచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. చర్మం పొడిబారినా, చెమట పట్టకపోయినా, మూత్రం రాకపోయినా డీహైడ్రేషన్(వడదెబ్బ)కు గురైనట్లేనని భావించాలి. ఆలస్యం చేయకుండా డాక్టరును సంప్రదించాలి. ఇక బీపీ, షుగర్, గుండె సంబంధిత, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రపిండ సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు ఎక్కువగా ఎండలో తిరగకపోవడమే మంచిది.

–డాక్టర్ ఎ.పుష్పలత, ఎండీ, జనరల్ ఫిజీషియన్



వడదెబ్బ బాధితురాలికి చికిత్స అందిస్తున్న డాక్టర్ పుష్పలత

పిల్లలకు కొబ్బరి నీళ్లు తాగించాలి

వేసవిలో పిల్లలు ఎక్కువగా ఎండదెబ్బకు గురవుతారు. ఆరుబయట ఆటలాడుతూ, దాహం వేసినా నీళ్లు తాగకపోవడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల పదేళ్లలోపు పిల్లలు తేలికగా ఎండదెబ్బకు గురవుతూ ఉంటారు. పిల్లలు నీరసంగా కనిపించినా, ఎక్కువ సమయంపాటు పడుకునే ఉంటున్నా, విరేచనాలు, వాంతులు అవుతున్నా డీహైడ్రేషన్‌కు గురైనట్టు భావించాలి. శరీరం వేడిగా ఉందేమో పరీక్షించి, చల్లని నీళ్లలో తడిపి పిండిన క్లాత్‌తో ఒళ్లు తుడవాలి. చక్కెర, కొద్దిగా ఉప్పు కలిపిన ఓఆర్ఎస్ తాగించాలి. ఎప్పటికప్పుడు పిల్లలు సరిపడా నీళ్లు తాగుతున్నారో, లేదో గమనించాలి. తాజా కూరగాయలు, పప్పు, పెరుగు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మసాలాలు, కారాలు ఈ కాలంలో తగ్గించి, పండ్ల రసాలు, క్యారెట్ జ్యూస్, మజ్జిగ, రాగి జావ, కొబ్బరి నీళ్లు ఇస్తూ ఉండాలి. శీతల పానీయాలు, జంక్ ఫుడ్ పిల్లలు తినకుండా చూసుకోవాలి. చక్కెర ఒంట్లోని నీటిని పీల్చుకుని, డీహైడ్రేషన్‌కు గురి చేస్తుంది. తీయగా ఉండే పానీయాలు, తీపి పదార్థాలకు పిల్లలను దూరం పెట్టాలి. డీప్ ఫ్రీజర్‌లో చల్లబరిచిన నీళ్లు కాకుండా, ఫ్రిజ్ డోర్‌లో ఉంచిన నీళ్లు తాగించడం మేలు.

–డాక్టర్ బి.వీరబాబు, పిల్లల వైద్య నిపుణులు, ఎంసీహెచ్ రామవరం



చిన్నారికి వైద్యం అందిస్తున్న డాక్టర్ వీరబాబు

వాహనాల రక్షణ ఇలా..

కొత్తగూడెంటౌన్: రోజురోజుకూ ఎండలు ముదిరిపోవడంతో వాహనాలతో బయటకు రావాలంటేనే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. రామవరంలోని మెయిన్ సెంటర్‌లో మెకానిక్ షాపు నిర్వహిస్తున్నా. 28 ఏళ్లుగా టూవీలర్ మెకానిక్‌గా పని చేస్తున్నాను. ఈ సారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. వాహనదారులు ఎండల నుంచి వాహనాలను రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తే గంట గంటకు వాహనం ఆపి ఇంజన్ చల్లబడే వరకు ఉంచాలి. చాలా దూరం ప్రయాణించేటప్పుడు వాహనాల్లో ఎండలకు షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశం ఉంది. వాహనాలను ఎప్పుడు చల్లని ప్రదేశాల్లో, నీడలో ఉంచాలి. వాహనాల్లో మైలేజీ కోసం గ్యాస్ కిట్లను వినియోగించొద్దు. గ్యాస్ కిట్లు అప్రూవల్ కిట్లు కాకుండా నాసిరకానివి వాడటం వల్ల వేసవి ఎండలకు అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఎండాకాలంలో లాంగ్ జర్నీ తగ్గించాలి. టైర్లలో గాలి తక్కువగా ఉండాలి. లేదంటే టైర్లు బరస్ట్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బైకులు, కార్లు వినియోగం పెరుగుతుంది. ఎండలో ఈవీ ఓనర్లు చాలా జాగ్రత్తలు పాటించాలి. చాలామంది సాధారణ బండ్ల వలే వినియోగిస్తుంటారు. వాటికి చార్జింగ్ పెట్టేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. బ్యాటరీ వేడిగా ఉన్నప్పుడు చార్జింగ్ పెట్టకూడదు. ఆయా వాహనాలకు చార్జింగ్ పెట్టి రాత్రుళ్లు వదిలివేయకూడదు. వేడికి అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

–రాజు, ద్విచక్ర వాహనాల మెకానిక్, రామవరం



ద్విచక్ర వాహనాలను రిపేర్ చేస్తున్న మెకానిక్

క్లుప్తంగా

అభివృద్ధి కార్యక్రమాల తనిఖీ



నర్సరీని పరిశీలిస్తున్న లక్ష్మీరమాకాంత్

మణుగూరురూరల్: మండలంలోని విప్పలసింగారం, బుగ్గ గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను, వైకుంఠధామాలను, డంపింగ్ యార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నర్సరీల్లో, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణ చేపడుతున్న చర్యలపై, డంపింగ్ యార్డుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఆయన పలుసూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు పాల్వంచ ఈశ్వరమ్మ, తాటి రామకృష్ణ, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ జి.కనకయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పాల్వంచరూరల్: ఐదు రోజుల కిందట ఓ వివాహిత అదృశ్యమైన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన కేటీపీఎస్ ఆర్టిజన్‌గా పనిచేస్తున్న బానోతు దేవేందర్ భార్య సింధుజ (26) ఈ నెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి కన్పించకుండా పోయింది. ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదని దేవేందర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేల స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని దుబ్బతోగు గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి, కోడి పందేలు ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని, కోడి పందేలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేశ్‌కుమార్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సత్యనారాయణ తన ఇంట్లో అక్రమంగా 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచిన సమాచారాన్ని తెలుసుకుని భద్రాచలం పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. అనంతరం పట్టుబడిన బియ్యాన్ని స్థానిక డీలర్‌కి అప్పగించి, సత్యనారాయణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: మండలంలోని కోడిపుంజలవాగు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ జర్పుల హతిరామ్‌పై మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి.. హతిరామ్‌పై అదే గ్రామానికి చెందిన అజ్మీర శ్రీను, కల్యాణ్, జాటోతు అశోక్ అకారణంగా రాళ్లతో దాడి చేసి, దూషించారు. దీంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బాలుడిపై వీధికుక్క దాడి

చండ్రుగొండ: మండల కేంద్రానికి చెందిన బాలుడు ఎస్కే ఫరియాజ్‌పై వీధికుక్క దాడి చేసి గాయపర్చిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వేసవి సెలవులు కావడంతో పిల్లలతో కలిసి ఫరియాజ్ ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో అటువైపుగా వచ్చిన కుక్కలగుంపులోని ఓ కుక్క బాలుడిపై దాడి చేసింది. చెవి, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుక్కను వారించేందుకు ప్రయత్నించగా వారిపై దాడికి ప్రయత్నించింది. బాలుడిని కిందపడేసి మరీ కరిచింది. ఇది చూసిన అక్కడి వారు భయభ్రాంతులకు గురయ్యారు. చివరకు బాలుడిని కుక్క వదిలేయడంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు. ఫరియాజ్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోనకల్: మండలంలోని కలకోట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మధిర మండలం దెందుకూరు గ్రామానికి చెందిన పల్లెపోగు శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై చిన్నారిని ఎక్కించుకొని వైరావైపు వెళ్తున్నాడు. కలకోట సమీపంలో గేదె ఎదురు రావడంతో గమనించని శ్రీకాంత్ గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌తో పాటు చిన్నారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆటోలో మధిర ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,205

కొలువుల పేరుతో దగా

జెన్‌కోలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ టోకరా

- పలువురి వద్ద రూ.లక్షలు వసూలు
- ఐదేళ్లుగా ఉద్యోగం కల్పించక.. డబ్బులు ఇవ్వక తిప్పుకుంటున్న నేతలు



కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: నిరుద్యోగ యువతను మోసం చేయడమే పనిగా పెట్టుకుంటున్నారు కొందరు కార్మిక సంఘాల నేతలు. జెన్‌కోలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ మాయమాటలతో లక్షలాది రూపాయలు దండుకున్నారు. 2018 నుంచి ఉద్యోగం ఇప్పించక పోయినా డబ్బులు తిరిగి ఇవ్వమని బాధితులు నాయకుల చుట్టూ తిరుగుతున్నా కనీసం పట్టించుకోక పోవడంతో లబోదిబోమంటున్నారు. ఇంట్లో నుంచి కొంత, బయటి నుంచి కొంత అప్పు చేసి తీసుకెళ్లి వేరే వ్యక్తుల చేతుల్లో పెట్టడంతో కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో బాధితులు ఏంచేయాలో పాలుపోక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రైవేట్ జాబ్‌లు చేసుకునేందుకు వెళ్దామన్నా.. వారి చదువుకు తగ్గట్టుగా విదేశాల నుంచి కూడా ఉద్యోగ అవకాశాలు వస్తున్నా చేతిలో చిల్లిగవ్వ లేక నానా అవస్థ పడుతున్నారు. ఓ కార్మిక సంఘం నేత ఇలా పలువురి వద్ద లక్షలాది రూపాయలు పోగు చేసుకున్నాడు. ఈ అక్రమ వసూళ్ల వ్యవహారంపై బాధితులు పోలీస్ స్టేషన్ వేదికగా సెటిల్‌మెంట్‌కు తెరలేపడం చర్చనీయాంశమైంది. మరో కార్మిక సంఘానికి అనుకూలంగా ఉండే వ్యక్తి సైతం భూ నిర్వాసితుల పేరుతో భారీ ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడికే ఉద్యోగం లేక పోగా ఇతరుల నుంచి డబ్బులు వసూలు చేసిన విషయంపై పలుమార్లు బాధితులు పోలీసులను ఆశ్రయించిన ఘటనలు కూడా ఉన్నట్లు సమాచారం.

ఉద్యోగం పేరుతో వల

పాల్వంచకు చెందిన బీటీపీఎస్ ఉద్యోగి (జేపీఏ), ఓ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. 2018 నుంచి మధ్యవర్తుల పేరుతో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వల విసురుతున్నాడు. ఓ ఫార్మసీ కళాశాలలో పనిచేసే లెక్చరర్ (ఆంధ్రావాసి) నుంచి జెన్‌కో జేఏవో (జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్) ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సుమారు రూ.25 లక్షల వరకు వసూలు చేశాడు. ఇక అతడినే పావుగా వాడుకుని అతడి ద్వారా సదరు కళాశాలలో పనిచేసే పలువురు లెక్చరర్లు, స్టూడెంట్ల నుంచి ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశాడు. డీసీజ్ కోటా (కారుణ్య నియామకాలు) ఉద్యోగాలు చాలా వరకు ఖాళీగా ఉన్నాయని, అందులో కొందరు వారసులు వేరే సెక్టార్లలో సెటిల్ అయ్యారని, అక్కడ మిగిలిన ఉద్యోగాలను దొడ్డిదారిన ఇప్పిస్తానని, ఆర్టిజన్ల మూడో లిస్ట్ కూడా తీస్తారని ఇలా ఏదో ఒక దాంట్లో ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపించినట్లు తెలుస్తోంది. సదరు లెక్చరర్ తాను ఉద్యోగం కోసం డబ్బులు కట్టానని.. మీరు కూడా కట్టండని కొందరిని నమ్మించాడు. దీంతో మంచిర్యాలకు చెందిన అమాయక మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువకుడు రూ.5 లక్షల వరకు అప్పు చేసి తెచ్చి ఇచ్చాడు. సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశారు. ఇలా భూపాలపల్లి, మంచిర్యాల, ఖమ్మం, సత్తుపల్లి, పాల్వంచ, సూర్యాపేట ప్రాంతాలకు చెందిన బాధితులు సుమారు 20 మంది వరకు ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. 2018లో వసూలు చేసిన ఈ డబ్బులను ఇప్పటి వరకు చెల్లించక పోవడంతో బాధితుల నుంచి ఒత్తిడి పెరిగింది. డబ్బులు కట్టే క్రమంలో ప్రాంసరీ నోట్‌లు, చెక్కులు ఇచ్చినప్పటికీ వాటిని కోర్టులో వేస్తే సెటిల్ అయ్యే సరికి ఏళ్లు గడుస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇటీవల పోలీసుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఉద్యోగం వస్తే ఇక్కడే సెటిల్ కావొచ్చని చెప్పి ఆశ పడ్డామని, భారీ మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో ఇంట్లో నుంచి కూడా ఒత్తిడి ఉందని, తమ చదువులకు విదేశాల నుంచి కూడా పలుమార్లు అవకాశాలు వచ్చినా డబ్బులు లేక తిరుగుతున్నామని బాధితులు వాపోయారు. కాగా, పది రోజుల్లోగా రూ.25 లక్షలు వెనక్కి ఇచ్చేలా సదరు కార్మిక సంఘం నాయకుడు నోట్ రాసి ఇవ్వడం గమనార్హం. ఈ విషయంపై జెన్‌కో సీఎండీ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు విశ్వసనీయ సమాచారం.

మరికొందరు ఇదే బాటలో..

అమాయక నిరుద్యోగులకు ఉద్యోగం పేరుతో కొందరు కార్మిక సంఘాల నేతలు లక్షలాది రూపాయలు దండుకుని బాధితులను కొన్నేళ్లపాటు తిప్పుకుని ఎగ్గొట్టడం, లేదా సెటిల్ చేసుకుని కొంత తిరిగి వెనక్కి ఇచ్చి కొంత ఇవ్వకుండా అక్కడక్కడ ఖర్చు చేయాల్సి వచ్చిందని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇలా పోగు చేసుకున్న డబ్బుతో భూములు, ఇళ్లు కొనుగోలు చేశారనే విమర్శలు ఉన్నాయి. అంతేగాక ఉద్యోగం ఎంత వరకు వచ్చిందని తిరిగే బాధితులతో మందు తెప్పించుకోవడం, వారి సొంత పనులు సైతం చేయించుకుని ఏళ్ల తరబడి తిప్పించుకున్నట్లు తెలుస్తోంది. అందరితో పాటు ఉద్యోగం చేసే నాయకులు కొందరు ఊహించని విధంగా ఎదగడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగం ఉండి కూడా నిరుద్యోగులను మోసం చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల మా దృష్టికి తెచ్చారు.



ఇటీవల ఉద్యోగం పేరుతో కార్మిక సంఘం నాయకుడు డబ్బులు తీసుకున్నాడని బాధితులు మా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై ఆరా తీస్తున్నాం. అయితే డబ్బులు వెనక్కి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు కూడా తెలిసింది. లిఖిత పూర్వకంగా బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుని న్యాయం చేస్తాం. ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– కె.నరేశ్, పట్టణ ఎస్ఐ

పెద్దమ్మతల్లికి పెరిగిన వేలం ఆదాయం



పెద్దమ్మగుడి వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో పలు వ్యాపార సముదాయాలకు బుధవారం దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పర్యవేక్షణ అధికారి పి.భేల్‌సింగ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలం దక్కించుకున్న వారు మే 18(గురువారం) నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 17 వరకు 11 నెలల పాటు లైసెన్స్ హక్కులు పొందుతారని, వేలంలో గతం కంటే రూ.49 వేల ఆదాయం అధికంగా వచ్చిందని ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఇందులో 3వ నంబర్ షాపునకు గతంలో రూ.71 వేలు ఉండగా, ఇప్పుడు రూ. 83 వేలకు, షాప్ నంబర్ 4కు గతంలో రూ.31,600 ఉండగా ప్రస్తుతం రూ.48,100 ఆదాయం లభించింది. ఆలయం వద్ద పూలదండలు అమ్ముకునేందుకు గతంలో రూ.61 వేలు ఉండగా ప్రస్తుతం రూ.72 వేలకు పెరిగిందని ఈఓ వివరించారు. షాప్ నంబర్ 1, 2 కొబ్బరి కాయల దుకాణాలకు, చీరల వేలం, టెంట్ సామగ్రి సరఫరాకు ఎవరూ వేలంలో పాల్గొనలేదని, దీన్ని తిరిగి 26న నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, ధర్మకర్తలు ఎస్వీఆర్‌కే ఆచార్యులు, కిలారు నాగేశ్వరరావు, గంధం వెంగళరావు, కాటారాపు లక్ష్మీనారాయణ, సంకా రామారావు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తి చేయండి..



ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

బూర్గంపాడు: ఇంకుడుగుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత మండల అధికారులను ఆదేశించారు. బుధవారం మోరంపల్లిబంజర గ్రామపంచాయతీలోని జింకలగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడుగుంతల నిర్మాణాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ అధికారులు, ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో ఇంకుడుగుంతల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రజలను చైతన్యపరచాలన్నారు. అన్ని గ్రామాల్లో నూరుశాతం ఇంకుడుగుంతల నిర్మాణాలను చేపట్టాలని పేర్కొన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు కూడా త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ వివేక్‌రామ్, సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు వాయిదా

- ఎండల నేపథ్యంలో పలువురి విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- జూన్ 13 నుంచి పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరగనున్న పలు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీఒకేషనల్, బీసీఏ, బీఏ (ఎల్) పీడీసీ కోర్సుల 4, 6వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ మధుకర్, డాక్టర్ నరేందర్ బుధవారం వెల్లడించారు. తిరిగి జూన్ 13 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేయూ పరిధిలో డిగ్రీ 4వ, ఆరో సెమిస్టర్‌ల పరీక్షలు కీలకమైనవి. మే నెలలోనే నిర్వహించాలనే విధంగా రెండు మూడుసార్లు టైం టేబుల్ షెడ్యూళ్లను విడుదల చేసినా పరీక్షల విభాగం అధికారులు వివిధ కారణాలతో ముఖ్యంగా వివిధ సెట్ల పరీక్షలు ఉండటంతో వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి ఈ నెల 22 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని టైం టేబుల్ విడుదల చేశారు. అయితే ఈ షెడ్యూల్‌ను ప్రకటించాక ఈవేసవిలో ఎండలు మండిపోతున్నాయని తమకు ఇబ్బంది అని పరీక్షల విధులను నిర్వహించాల్సిన వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హనమకొండ, వరంగల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు మహిళా అధ్యాపకులు బుధవారం వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డిని కలిసి డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని విన్నవించారు. వారికి మద్దతుగా ఏబీవీపీ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ ఉన్నారు.

ఆలస్యమైతే ఫలితాలపై ప్రభావం

డిగ్రీ కోర్సుల విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు కీలకమైనవి. ఈ పరీక్షలు మే, జూన్‌లో పూర్తయితేనే ఫలితాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు జూన్ – జూలైలో జరగబోతున్నందున ఫలితాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ఎందుకంటే డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ పరీక్షలతో కోర్సు పూర్తయితే ఉన్నత విద్య ఇతర కోర్సుల్లోకి ప్రవేశాలకు అవకాశం కలుగుతుంది. పీజీతోపాటు వివిధ ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి ప్రవేశపరీక్షలు అన్నీ మే నెలలోనే జరగబోతున్నాయి. వాటి ఫలితాలు వచ్చేలోగా డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూరిచేసి ఫలితాలను సకాలంలో ఇస్తేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కేటీపీఎస్‌లో పర్యటించిన విజిలెన్స్ ఎస్పీ



జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ముత్యంరెడ్డి

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారంలో టీఎస్ జెన్‌కో ఎస్పీ (విజిలెన్స్) ఎ.ముత్యంరెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కేటీపీఎస్ ఓఅండ్ఎం, 5, 6 దశల్లో పర్యటించారు. నూతనంగా నిర్మించిన జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడి వసతులను సీఈ శ్రీనివాసబాబును అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఫైల్స్‌పై ఆరా తీశారు. గాజుల రైల్వే లైన్‌లో కొత్తగా వేసిన ట్రాక్‌కు ఎలక్ట్రికల్ లైన్ ఏర్పాటు చేసే అంశంపై పరిశీలించాలని అనుకున్నా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఎస్పీ వెంట సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, శ్రీనివాసబాబు, ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీఎఫ్ అదనపు కమాండెంట్ సి.జంగయ్య, అసిస్టెంట్ కమాండెంట్ అప్పయ్యఅప్పాజీ, పలువురు ఇన్‌స్పెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(హెచ్142) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు వెంపటి వెంకటేశ్వర్లు, డి.సత్యరాజ్‌స్టీవెన్, ఎస్.నాగభూషణం, సుమన్, ప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరుటౌన్: రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల కోసం ఎంప్లాయ్‌మెంట్, ట్రెనింగ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కన్వీనర్, మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2023లో ప్రవేశాల కోసం ఈ నెల 17 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని, మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో మొత్తం 5 ట్రేడ్స్ ఉన్నాయని, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్, సివిల్, డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్ (కోపా) కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. వాటిలో ప్రవేశాల కోసం కనీసం 10వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వడదెబ్బతో మహిళ మృతి



పులి కోటేశ్వరమ్మ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: అధిక ఎండలతో ఓ మహిళ వడదెబ్బకు గురై అర్ధరాత్రి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని నందమూరినగర్‌కు చెందిన పులి కోటేశ్వరమ్మ (58) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే అధిక ఎండలతో మంగళవారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురై పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

'ఎక్సైజ్'లో బదిలీల కాక !

చర్చనీయాంశంగా మారిన ఇద్దరు సీఐల స్థానచలనం

ఖమ్మంక్రైం : జిల్లా ఎక్సైజ్ శాఖలో ఇద్దరు సీఐలు బదిలీ అయిన విషయం కాక పుట్టిస్తోంది. పలువురు అధికారులు ఎన్నో ఏళ్లుగా బదిలీ కోసం ఎదురుచూస్తుండగా ఇద్దరు సీఐలకు మాత్రమే స్థాన చలనం కలగడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం ఎక్సైజ్ టూటౌన్ సీఐగా పనిచేస్తున్న జయశ్రీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, అక్కడ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న రాజిరెడ్డిని ఖమ్మం టూటౌన్‌కు బదిలీ చేశారు.

చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు..

ఎక్సైజ్ శాఖలో గతంలో కమిషనర్ మాత్రమే సీఐ స్థాయి అధికారులను బదిలీ చేసేవారు. కానీ ఇప్పుడు దీనికి భిన్నంగా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం. దీంతో ఇది రాజకీయ బదిలీ అని ఎక్సైజ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎక్సైజ్ స్టేషన్ – 2 పరిధి పాలేరు నియోజకవర్గంలో ఉండటంతో అక్కడి బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధి ఒత్తిడి వల్లే ఈ బదిలీ జరిగిందని, ఏకంగా చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యేలా ఆ ప్రతినిధి చక్రం తిప్పారని ఎక్సైజ్ సిబ్బంది అంటున్నారు. అయితే ఖమ్మం ఎక్సైజ్ టూటౌన్ నుంచి బదిలీ అయిన సీఐ కూడా జిల్లాలో కీలకమైన బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి కూతురు కావడం గమనార్హం. దీంతో ఈ బదిలీ వ్యవహారంపై ఆ శాఖలో మరింతగా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో 17 మంది ఎక్సైజ్ సీఐలు ఏళ్ల తరబడి బదిలీలు జరగక, పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు.

అదే విధంగా సీఐలుగా పదోన్నతి పొంది రెండేళ్లు దాటినా పోస్టింగ్ లేక ఎస్సైలుగా పని చేస్తున్న వారిలో ఒకరికి ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ –2 సీఐగా పోస్టింగ్ ఇవ్వడంతో తమకు మోక్షం ఎప్పుడోనని మిగిలిన వారు ఎదురు చూస్తున్నారు. కాగా, ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్– 2 సీఐగా రాజిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో తొర్రూరు, కొత్తగూడెంలో కూడా పని చేశారు.

బావిలో పడి యువకుడు మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) లక్ష్మణ్ (ఫైల్)

పది రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి..

టేకులపల్లి: మద్యం మత్తులో బావిలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని తావుర్యాతండా పంచాయతీ స్టేషన్ తడికలపూడి గ్రామానికి చెందిన ధారావత్ బధ్యా – ఇస్తారి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమారుడు ధరావత్ లక్ష్మణ్ (28) కూలి పనులు చేసుకుంటూ వచ్చే డబ్బులతో మద్యానికి బానిసయ్యాడు. అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి వారం పది రోజుల తరువాత వస్తుండేవాడు. ఈ నేపథ్యంలోనే వారం రోజుల కిందట లక్ష్మణ్ ఇంటి నుంచి వెళ్లాడు. గతంలో లాగే తిరిగి వస్తాడులే అని కుటుంబ సభ్యులు భావించారు. తడికలపూడి రైల్వే స్టేషన్ వెనకాల ఉన్న పాత బావిలో దుర్వాసన వస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బుధవారం టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సర్పంచ్ రమేశ్, గ్రామస్తుల సహకారంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన ధరావత్ లక్ష్మణ్‌గా గుర్తించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో దహన సంస్కారాలు చేశారు. మృతుడి తల్లి ఇస్తారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మూకమామిడి ప్రాజెక్ట్‌లో వ్యక్తి గల్లంతు?

ములకలపల్లి: మండలంలోని మూకమామిడి ప్రాజెక్ట్ (మధ్యతరహా నీటిపారుదల జలాశయం)లో వ్యక్తి గల్లంతైనట్లు బుధవారం రాత్రి పుకార్లు షికారు చేశాయి. గ్రామానికి చెందిన ఓ వృద్ధుడి బట్టలు, చెప్పులు ప్రాజెక్ట్ సమీపంలో ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఐతే సదురు వ్యక్తి రాత్రి పొద్దుపోయే వరకూ ఇంటికి చేరకపోవడంతో అనుమానాలు రేకెత్తుతున్నాయి. భూ వివాదం నేపథ్యంలో ఇంట్లో గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బలవన్మరణానికి పాల్పడ్డాడా? లేక బెదిరింపులకు గురిచేసేందుకు మరెక్కడైనా తలదాచుకున్నాడా? అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.



ప్రాజెక్ట్ సమీపంలో వదిలేసిన బట్టలు, చెప్పులు

